క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం రాంమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిపో పరిధిలో ఏమైనా బస్సులకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి సెల్ నంబరు 9959226308 ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

దేవరకొండ డిపో పరిధిలో..

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ఆర్టీసీ బస్సు సర్వీసులకు సంబంధించిన సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సలహాలు, సూచనలకు సెల్‌నంబర్ 9959226311ను సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు హన్మంతరెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గాంధీనగర్‌లో దాసరి స్వప్నకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి సోమవారం బాధిత కుటుంబానికి రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వప్న కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బాషిపాక శివ శంకర్, నాయకులు శివ, మూల రాజిరెడ్డి, రాజు, కంచుకొమ్ముల వేణు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న సభ్యులు

వేములపల్లి(మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని ధర్మాపురం గ్రామంలో 244, 245 బూత్ ల బీజేపీ కమిటీల నూతన అధ్యక్షులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నరసింహ నూతనంగా ఎన్నికైన వారికి నియామకపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ల జానకిరాములు, మండల ప్రధాన కార్యదర్శి ఇటికాల జాన్‌రెడ్డి, శ్రీను, వెంకన్న, పార్వతమ్మ, రమ్య, శివ, రాకేష్, రమేష్, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం మిర్యాలగూడ మండలం ఆలగడప వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

'భూ భారతి'తో వివాదాలు పరిష్కారం

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి చట్టంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధరణితో రైతుల భూ సమస్యలు పరిష్కారం కాలేదని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతుల సమస్యలు తీర్చేలా భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని దుర్గానగర్‌లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఎలాంటి వ్యాధులు రావన్నారు. పట్టణ ప్రజలు కూడా వార్డుల్లోకి వచ్చే చెత్త సేకరణ వాహనాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి వేయాలన్నారు. అదే విధంగా ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇక్కట్లు

- యాప్‌లో వివరాల నమోదుకు సాంకేతిక సమస్యలు
- మున్సిపాలిటీలో మొత్తం 20,605 దరఖాస్తులు
- 7,885 ఇళ్ల సర్వే పూర్తి
- ఈ నెలాఖరుకు సర్వే పూర్తికి గడువు

మిర్యాలగూడ టౌన్ : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు సర్వేలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యతో సర్వేలో జాప్యం జరుగుతుంది. మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో వార్డు ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల కోసం వార్డుల వారీగా స్వీకరించిన దరఖాస్తులు ఆధారంగా అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నవారికి ప్రత్యేక ఐడీ సంఖ్యను ప్రభుత్వం కేటాయించింది. దరఖాస్తుల్లో ఇళ్లు లేనివారికి సర్వే చేసి మొదటి విడతలో ఎంపిక చేయనున్నారు.



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

పెద్ద మొత్తంలో దరఖాస్తులు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 48 వార్డుల నుంచి మొత్తం 20 వేల 605 దరఖాస్తులు వచ్చాయి. అయితే మున్సిపాలిటీలో ఈనెల 22వ తేదీ నాటికి 7 వేల 885 దరఖాస్తుల సర్వే పూర్తయింది. అయితే సర్వేలో సాంకేతిక పరంగా వివరాల నమోదు సేకరణలో అవంతరాలు ఎదురవుతున్నారు. సాఫ్ట్‌వేర్‌లో అర్హుల ఇళ్లను గూగుల్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్ సరిగా రాకపోవడంతో పాటు సర్వర్ ఆన్‌గాకపోవడంతో సర్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా చేర్పులు, మార్పులు లేకపోవడంతో ఎంతో మంది ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హత కోల్పోయే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి మరోసారి అవకాశం కల్పిస్తే పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది. సేకరిస్తున్న వివరాలు..

31వ తేదీ వరకు సర్వే పూర్తి



మున్సిపాలిటీలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా చేపట్టడం జరుగుతుంది. అక్కడక్కడ కొంత వరకు సాంకేతిక సమస్యలు వస్తున్నప్పటికి వాటిని అధిగమిస్తే సర్వే ప్రక్రియను ముమ్మరం చేయడం జరిగింది. ఈ నెల 31వ తేది వరకు సర్వే పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాం. సాధ్యమైనంత మేరకు పూర్తి అయ్యే విధంగా ఎప్పటికప్పుడు నేను సర్వే పరిశీలిస్తాను.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

చింతపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 108 వాహనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రులకు చేర్చేందుకు 108 వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాహనాల సర్వీస్ అయిపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త వాహనాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. .ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, వైస్ ఎంపీపీ యాది గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, యాదగిరి, శ్రీనివాస్ యాదవ్, చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు వెంకట్ నర్సింహారెడ్డి, శ్రీను, నర్సింహ, రియాజ్ పాషా, జహంగీర్, జితేందర్ రెడ్డి,గుండ్ల పల్లి నర్సింహారెడ్డి, పుల్సింగ్, పురుషోత్తంరెడ్డి, రాములు, కొండల్‌యాదవ్, దాసరి రాజు, భైకం రాములు, మెండ వెంకటయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పేద క్రైస్తవులను ప్రభుత్వం ఆదుకుంటుంది



మిర్యాలగూడ : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ : రాష్ట్రంలోని పేద క్రైస్తవులను ప్రభుత్వం ఆదుకుంటుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం పట్టణంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులకు తెలంగాణ ప్రభుత్వం విందు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ హరిబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలి

దేవరకొండ : క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని సాయిశివ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో సర్వమతాలకు సమానమైన సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రజాప్రభుత్వ విధానమని ఆయన తెలిపారు. విద్య, వైద్యం విషయంలో క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వాలతో పోటీ పడి నిరుపేదలకు సేవలు అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. . అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, ఆలంపల్లి నర్సింహ, దేవేందర్, పాస్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

మిర్యాలగూడ : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు, పోలీసులు, మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రదర్శన చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే వ్యాపారంపరంగా అగ్రగామిగా నిలిచిన మిర్యాలగూడలో ప్రధానంగా సాగర్‌రోడ్డు ఒక్కటే ఉండడం వల్ల నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుందన్నారు. లక్షలాది మంది నిత్యం మిర్యాలగూడకు వచ్చి పోతుండడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ప్రధానంగా ఆయా షోరూంలు, కార్యాలయాలు, బ్యాంకుల వద్ద పార్కింగ్‌లు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారని, దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారస్తులు, వీధి వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. 'చేయి కలుపుదాం- ట్రాఫిక్‌ను నియంత్రిద్దాం' అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎస్ఐలు రాంబాబు, సైదిరెడ్డి, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, వెంకటరమణచౌదరి, గుడిపాటి నవీన్, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలు, జలంధర్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, ఎండి.జాని, రామకృష్ణ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తుంగపాడు ఆదర్శపాఠశాలలో హాస్టల్ విద్రార్థులకు కుళ్లిన కూరగాయలతో భోజనాలు పెడుతున్నారని వెంటనే హాస్టల్ వార్డెన్ సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్‌నాయక్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తుంగపాడు ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆ హాస్టల్లో తరుచూ ఫుడ్ పాయిజన్ అవుతూ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, పాడైపోయిన పండ్లు అందిస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే మెనూ విషయంలో వార్డెన్ పట్టింపు లేకుండా ఉన్నాడని, జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుమాన్, తరుణ్, సోహెల్, పవన్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా డిమాండ్లు నెరవేరలే



త్రిపురారం : నిడమనూరులో బస్ జాతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశ కార్యకర్తలు



మిర్యాలగూడ అర్బన్: బస్ జాతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశ కార్యకర్తలు

త్రిపురారం : ప్రభుత్వాలు మారినా ఆశ కార్యకర్తల డిమాండ్లు నెరవేరలేదని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, సీఐటీయూ మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్యలు అన్నారు. సోమవారం నిడమనూరు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో కలిసి బస్ జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు రూ. 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐతో పాటుగా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు బారెడ్డి అనుషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తోటపల్లి బాల నారాయణ, మమత, మహేశ్వరి, షాహిన్, సునీత, జ్యోతి, విజయ లక్ష్మీ, సలోమి పాల్గొన్నారు.

బస్సు జాతాను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : ఆశవర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బస్ జాతాకు ఆశ వర్కర్లు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతం రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లోని పీహెచ్‌సీలో బస్‌జాతా పోస్టర్‌ను ఆశ వర్కర్లతో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న బస్సుజాతా నల్లగొండకు వస్తుందని ఆశ వర్కర్లు భారీగా తరలివచ్చి విజవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మహేశ్వరి, స్వర్ణ, రామ శేష తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

పెద్దఅడిశర్లపల్లి : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు ఆదేశించారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద గుడిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను , వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని నేరాల వివరాలు గురించి ఎస్ఐ నర్సింహులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహులు, గుడిపల్లి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి : టీఎస్ యూటీఎఫ్ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలను ఈనెల 28,29,30 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పాల్గొంటారని తెలిపారు. ఈనెల 28న విద్యా సదస్సులో భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలకు ఏమీ జరుగుతుంది. అనే అంశంపై ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ప్రసంగం ఉంటుందన్నారు. అనంతరం సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముసుగు ఆనంద్ బాబు, సీనియర్ నాయకులు బద్దెల కృష్ణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు వాణి కుమారి శ్రీలత, భాగ్యలక్ష్మి, సువర్ణ, సుమలత, ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో గణిత దినోత్సవం



గిరిజన ఆశ్రమ పాఠశాలలో మ్యాథ్స్‌డే ఆంగ్ల అక్షరాలతో విద్యార్థులు

పెద్దవూర : గణిత మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మ్యాథ్స్ డే అక్షరాలతో విద్యార్థులు కూర్చున్నారు. శాంతినికేతన్ గురుకుల పాఠశాలలో జ్యామెట్రిక్, పెన్నులు, పెన్సిళ్లతో గణిత నమూనాను తయారు చేశారు. పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు డి.బాలోజీ, నడ్డి ఆంజనేయులు, వసతి గృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు రాంరెడ్డి, శ్రీనునాయక్, షబ్బీర్, సురేందర్, సైదులు, సంధ్య, శాంతి, షాహీన్‌బేగం, రామయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాఘవ

త్రిపురారం : మండలంలోని పెద్దదేవుల పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి. రాఘవ సీఎం కప్ 2024 గ్రామీణ క్రీడోత్సవాల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 22న జిల్లా కేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టీంకు ఎంపికైనట్లు సోమవారం త్రిపురారం ఎంఈఓ రవి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర జిల్లాలో ఎన్నికైన టీం క్రీడాకారులతో కలసి డిసెంబర్ 27న ఖమ్మం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ పోటీల్లో ఆడనున్నట్లు పేర్కొన్నారు. బీ రాఘవను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీఓ సుధీర్‌కుమార్

పెద్దవూర : ప్రభుత్వం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన వసతిగృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది హాజరు పట్టికలు, వంటశాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తాజా కూరగాయలు, ఆకుకూరలను తెచ్చి విద్యార్థులకు వడ్డించాలని అన్నారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన దుప్పట్లను అందించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ కె.బాలకృష్ణ, పంకజ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎండీ.షబ్బీర్, రామయ్య, సైదులు, షాహీన్‌బేగం, శ్రీను నాయక్, సంధ్యా, జ్యోతి, నాగేందర్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల అయ్యే విధంగా చూడాలని కోరుతూ సోమవారం బీసీ సంఘం నేత జాజుల లింగంగౌడ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట రమేష్, టిల్లు తదితరులున్నారు.

ఓట్ల తొలగింపునకు కుట్ర

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఒకటో వార్డులో పలువురి ఓట్ల తొలగింపునకు ఓ మాజీ వార్డు మెంబర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం చర్చనియాంశంగా మారింది. బీఎల్ఓ పరిశీలనలో ఈ అంశం వెలుగు చూడడంతో తహసీల్దార్ దృష్టికి వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు పలువురు ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మహమ్మద్ అన్వర్ హుస్సేన్‌ను వివరణ కోరగా ఓటర్ల ప్రమేయం, అనుమతి లేకుండా మరొకరు ఓటు తొలగింపునకు పాల్పడితే చర్యలు ఉంటాయని తెలిపారు.

మృతురాలి నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్ : నల్లగొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దుబ్బాక మల్లమ్మ సోమవారం మృతి చెందారు. మల్లమ్మ కుటుంబ సభ్యుల అనుమతితో నల్లగొండ పట్టణ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ హరనాథ్ కంటి డాక్టర్ పుల్లారావు సోమవారం మృతురాలి నేత్రాలను సేకరించారు.హైదరాబాద్‌లోని ప్రముఖ హాస్పిటల్‌కు సేకరించిన నేత్రాలను (కార్నియా) పంపించి, 72 గంటల్లోగా కార్నియా సమస్యతో బాధపడుతున్నవారికి శస్త్ర చికిత్స చేసి కంటిచూపు తెప్పిస్తామని తెలిపారు. నేత్రదానం చేయాలనుకునేవారు 9948143299 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

సీసీఐ కేంద్రాల తనిఖీ



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : సీసీఐ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి, పీఏపల్లి మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గౌస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేసే క్రమంలో తేమ, తూకం తదితర అంశాలల్లో సిబ్బంది పాటిస్తున్న నిబంధనల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఇందిరా, ఏఈఈ రాఘవేందర్ తదితరులున్నారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం.. ముగ్గురిపై కేసు

నల్లగొండ క్రైం: కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన అంకోజు సతీష్‌కుమార్ ఇంట్లో అతడితో పాటు అంకెనపల్లి ప్రభాకరచారి, సాలోజు హరిప్రసాద్ ఆదివారం రాత్రి విందు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ వివాదం జరగడంతో స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా వెంటనే టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను దూషించారు. పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ లింగస్వామి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో కానిస్టేబుల్ లింగస్వామి సోమవారం టూటౌన్ ఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అయితే సతీష్‌కుమార్ ఇంటి సమీపంలో ఉంటున్న ఓ కానిస్టేబుల్‌తో అతడికి కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఆ కానిస్టేబులే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడితోనూ వివాదానికి దిగారు.

బిల్లులు విడుదల చేయాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులు విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఎండీ సయ్యద్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారం పడుతుందన్నారు. నాలుగు నెలల నుంచి బయట అప్పులు తెచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ సభ్యులు వెంకటమ్మ, జాన్‌బి, గౌస్య, జ్యోతి, అంజమ్మ, పద్మ, విజయకుమారి, నాగయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులు, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. సోమవారం మండలంలోని పాల్తీతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తండాకు చెందిన పాల్తీ శంకర్ టై,బెల్టులు, ఐడీ కార్డులు, పాల్తీ రమేష్ క్రీడా దుస్తులను తన సొంత ఖర్చులతో అందజేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టై, బెల్టులు, స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేస్తున్న ఎంఈఓ